నమస్తే తెలంగాణ
# జగిత్యాల
10 కరీంనగర్, సోమవారం 17 మార్చి 2025 JAGTIAL

# అధికారులూ.. ఇదేం తీరు!

## జగిత్యాలలో వివాదాస్పదమవుతున్న అధికారుల వ్యవహారశైలి

- ఇప్పటికే కొందరిపై చర్యలు!
- మరి కొందరిపైనా వేటు పడే అవకాశం




జగిత్యాల జిల్లాలో పలువురు అధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది. కొందరి వ్యవహారశైలి వివాదాస్పదంగా మారుతున్నది. ఇప్పటికే కొందరు కీలక ఆఫీసర్ల తీరు సరిగా లేకపోవడంతో వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోగా, మరికొందరిపైనా వేటు పడే అవకాశాలున్నాయని ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. అయితే జిల్లా, డివిజన్ స్థాయి ఆఫీసర్ల తీరు సరిగా లేకపోవడంతో, పలు అంశాల్లో ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ప్రధాన అధికారులు తీవ్ర మనస్తాపం చెందడమే కాదు, ఇలా ప్రవర్తిస్తే ఎలా పాలన చేయగలుగుతామని, సన్నిహిత ఉద్యోగుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది.

- జగిత్యాల, మార్చి 16 (నమస్తే తెలంగాణ)

### అదనపు బాధ్యతలు తొలగింపు

కొద్ది నెలల క్రితం జగిత్యాల జిల్లాలో ఓ కీలక అధికారి పోస్టు ఖాళీ అయింది. ఆ బాధ్యతలను మరో కీలక పోస్టులో కొనసాగుతున్న ఉన్నతాధికారికి అదనంగా అప్పగించారు. అయితే అదనపు బాధ్యతలు రావడంతో ఆ ఆఫీసర్ కొన్నాళ్లు చక్రం తిప్పారు. ఉన్నతాధికారులు సైతం సదరు అధికారి సీనియర్ మోస్ట్ కావడంతో ప్రాధాన్యత సైతం ఇచ్చారు. జిల్లా పరిధిలో గుర్తింపు రావడం, డివిజన్, మండల స్థాయి అధికారులు సదరు అధికారి ప్రాపకం కోసం వేచి చూడడం ఆరంభమైంది. ప్రాధాన్యత పెరుగుతున్న క్రమంలో సదరు అధికారి వ్యవహారశైలి వివాదాస్పదం కావడం మొదలైంది. జిల్లా స్థాయిలో కొందరు అధికారులను కూడగట్టుకొని కోటరీని తయారు చేశాడన్న ఆరోపణలు రావడం ప్రారంభమైంది. అలాగే ఉన్నతాధికారులతో సత్సంబంధాలు ఉండడంతో సదరు అధికారి, తన వర్గానికి చెందిన ఉద్యోగులకు కీలక శాఖల ఇన్‌చార్జి బాధ్యతలను కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. అదే సమయంలో సదరు అధికారికి మండల, పట్టణ స్థాయిలో పని చేసే అధికారులు గొడుగులు పట్టే స్థాయికి దిగజారారన్న మాటలు ఉద్యోగ వర్గాల్లో మొదలయ్యాయి. ఇతరత్రా ఆరోపణలు సైతం చుట్టుముట్టాయి. ఈ క్రమంలోనే ఆ అధికారి వ్యవహారశైలి ఉన్నతాధికారులకు సైతం ఆగ్రహం కలిగించినట్టు తెలుస్తున్నది. జిల్లా స్థాయి అధికారి పోస్టుకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న తనకు అధికారిక వాహనంతో పాటు, బంగళాను కేటాయించాలని కోరగా, నిబంధనల ప్రకారం ఇవ్వడానికి వీలు లేదని ఉన్నతాధికారులు తేల్చిచెప్పడంతో వారికి, ఆయనకు మధ్య దూరం పెరిగింది. ఈ క్రమంలో ఒక కీలక సమీక్షా సమావేశానికి సదరు ఇన్‌చార్జి అధికారి గైర్హాజరు కావడం, ఎందుకు రాలేదని ప్రశ్నిస్తే, తనకు వాహనం లేదని, అందుకే రాలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే సదరు అధికారికి ఇచ్చిన ఇన్‌చార్జి హోదాలను తొలగించి, మరో జిల్లా స్థాయి అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

### మరో అధికారి సరెండర్

ఆరోపణల నేపథ్యంలో మరో జిల్లా స్థాయి అధికారిని ఆయన మాతృశాఖకు సరెండర్ చేసినట్టు తెలుస్తున్నది. కొన్ని నెలల క్రితం ప్రాథమిక రంగానికి సంబంధించిన ఒక అనుబంధ శాఖ అధికారి జిల్లా అధికారిగా బదిలీపై వచ్చాడు. అయితే సదరు అధికారి వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు తావిచ్చింది. సంబంధిత శాఖకు సంబంధించిన రైతులతో పాటు అగ్రిమెంట్ చేసుకున్న కంపెనీ వారు.. సదరు అధికారి తమను తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నాడంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు అధికారి వ్యవహార ధోరణి సరిగా లేదని, రైతులకు రావాల్సిన సబ్సిడీని వర్తింపజేయడం లేదని, అగ్రిమెంట్ చేసుకున్న కంపెనీ నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని, సలహాలు, సూచనల కోసం వచ్చే రైతులపై పరుషమైన భాషతో విరుచుకుపడుతున్నాడని కంప్లయింట్ ఇచ్చారు. అలాగే ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే 50 ఎకరాలకు సాగుకు అనుమతులు ఇచ్చాడని, అలాగే పొరుగున ఉన్న జిల్లాలో ఉన్న సంబంధిత శాఖ అధికారుల విషయాల్లోనూ, అగ్రిమెంట్లలోనూ తలదూర్చుతూ ఇబ్బందులు పెడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు సదరు అధికారికి వివరణ ఇవ్వాలంటూ ఫిబ్రవరి మూడో వారంలో మెమోను జారీ చేశారు. కానీ, సదరు అధికారి నుంచి సరైన వివరణ రాకపోవడంతో, ఆయనను అతడి మాతృసంస్థకు సరెండర్ చేసి, అతడి బాధ్యతలను మరో శాఖ అధికారికి అప్పగించడం అధికారవర్గాల్లో సంచలనమైంది.

### మరో కీలక అధికారిపై ఆరోపణలు

వేటుపడ్డ అధికారుల వ్యవహారశైలి ఇలా ఉండగా, మరికొందరు అధికారుల తీరు సైతం సరిగా లేదనే మాటలు వినిపిస్తున్నాయి. జిల్లాలో కీలక బాధ్యతల్లో ఉన్న ఒక అధికారిపై సైతం తీవ్రమైన ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్నట్టు ఉద్యోగులు చెబుతున్నారు. సదరు అధికారి ఈ యేడాది ప్రారంభంలో రాష్ట్ర సరిహద్దులో ఉన్న మరో రాష్ట్రంలో ఉన్న రిసార్ట్‌లో కుటుంబంతో వేడుకలు జరుపుకొన్నారని, దానికి సంబంధించిన ఖర్చునంతటినీ తన పరిధిలోని ఒక శాఖకు సంబంధించిన అధికారులు చెల్లించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే ఇటీవల సదరు అధికారికి సంబంధించిన అధికారిక వాహనం మరమ్మతులకు రాగా, మరో వాహనాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఆ వాహనం చిన్నగా ఉందని, సౌకర్యంగా అనిపించడం లేదని సదరు అధికారి ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు కంగుతిన్నట్టు తెలుస్తున్నది. అయితే సదరు జిల్లా స్థాయి అధికారి తన పర్యవేక్షణలో ఉన్న ఒక శాఖ కింద వ్యాపారం చేసే ఒక పెద్ద వ్యాపారికి ఫోన్ చేసి తాత్కాలికంగా వాహనం కావాలని కోరాడని, దీంతో సదరు వ్యాపారి, అధికారికి తన ఖరీదైన వాహనాన్ని ఏర్పాటు చేసినట్టు సమాచారం. అయితే ఆఫీస్ ప్రాంగణంలో సదరు వ్యాపారి వాహనం ఉండడాన్ని గుర్తించిన జిల్లా ఉన్నతాధికారి, 'ఈ వాహనం ఇక్కడికి ఎందుకు వచ్చింది' అని ఆరా తీయగా, అసలు విషయం తెలియడంతో కీలక అధికారిపై సైతం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. 'సీనియర్ అధికారులు సైతం ఇలా బిహేవ్ చేస్తారా' అంటూ తన నిరసనను బాహాటంగానే వ్యక్తీకరించినట్టు తెలుస్తున్నది. వేటు పడ్డ అధికారులతోపాటు ఇంకా పలువురు అధికారుల వ్యవహారశైలి వివాదాస్పదంగా ఉందని, వారి వల్ల విమర్శలు వస్తున్నాయన్న ఆవేదన ఉన్నతాధికారుల్లో వ్యక్తమవుతున్నట్టు సమాచారం. ఇలా ప్రవర్తించి, విమర్శలకు తావిస్తే, ఎలా పాలన చేయాలని సదరు ఉన్నతాధికారి తన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. జిల్లాలో పని చేసే మరికొందరు అధికారులపై సైతం చర్యలు ఉండే అవకాశం ఉందన్న మాటలు వినిపిస్తున్నాయి.

### ఇంకో డివిజన్ స్థాయి అధికారి..

జిల్లాలోని ఒక డివిజన్ స్థాయి అధికారిని సైతం కొన్నాళ్ల క్రితం సరెండర్ చేశారు. కానీ ఆ విషయాలు బయటకు రాలేదు. అయితే సదరు అధికారి వ్యవహారశైలి సైతం తీవ్ర విమర్శల పాలైనట్టు తెలుస్తున్నది. జిల్లాలోని ఒక డివిజన్ స్థాయి అధికారిగా పనిచేసిన అధికారి, అదే కార్యాలయంలో పనిచేస్తున్న మరో మహిళా అధికారితో సన్నిహితంగా ఉన్నట్టు సమాచారం. అయితే ఆ మహిళా అధికారికి సదరు అధికారి పెద్ద మొత్తంలో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసిన వ్యవహారం అతడి ఇంట్లో తెలియడం, అతడి భార్య వచ్చి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో అంతర్గతంగా విచారణ జరిపించి సదరు అధికారిపై చర్యలు తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఇక ఆ మహిళా ఉద్యోగిని బదిలీ చేయడంతోపాటు డివిజన్ స్థాయి అధికారిని మాతృశాఖకు సరెండర్ చేసినట్టు సమాచారం. అయితే విచారణతోపాటు ఇతర వ్యవహారాలన్నీ అంతర్గతంగా సాగడంతో సదరు డివిజన్ స్థాయి అధికారి బదిలీ విషయం బయట ప్రచారం జరుగలేదని ఉద్యోగులు చెబుతున్నారు.



శాత్రాజుపల్లిలో నీరులేక పిచ్చిమొక్కలతో నిండిపోయినఊర చెరువు

# అడుగంటిన ఆశలు

- వేములవాడ మండలంలో సాగునీటికి కటకట
- నీరులేక చెరువులు విలవిల
- గత ప్రభుత్వంలో ఎల్లంపల్లి జలాల తరలింపుతో కళకళ
- గత రెండు సీజన్లు పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- తూతూమంత్రంగానే సరఫరా
- పడిపోయిన భూగర్భ జలాలు
- ఆందోళనలో రైతన్నలు
- యాసంగి పంటకు తప్పని తిప్పలు

**రైతన్న ఆశలు ఆవిరవుతున్నాయి. వేములవాడ మండలంలో చెరువులు, కుంటలు అడుగంటిపోతున్నాయి. ఒకప్పుడు పుష్కలమైన జలాలతో కళకళలాడిన జలవనరులు, కాంగ్రెస్ ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యంతో రెండు సీజన్లుగా నీరు లేక వెలవెలబోతున్నాయి. ఇటీవల ఎల్లంపల్లి బరాజ్ నుంచి కేవలం మూడు, నాలుగు చెరువులకు మాత్రమే నీటిని తరలించి చేతులు దులుపుకోవడంతో, మిగిలిన 13 చెరువులు ఎండిపోయాయి. భూగర్భ జలాలు పడిపోయి, బావులు, బోర్లు ఎత్తిపోతున్నాయి. ఫలితంగా సాగునీటి కష్టాలు తీవ్రమై, సాగుకు నీరందక పొలాలు నెర్రెలు బారుతుండగా, రైతులు ఆగమవుతున్నారు. వెంటనే నీటిని తరలించాలని వేడుకుంటున్నారు.**



వేములవాడ రూరల్ మండలం వట్టెంలో ఎండిపోయిన రొంపి చెరువు

వేములవాడ రూరల్, మార్చి 16: వేములవాడ రూరల్ మండలంలోని మూడు పెద్ద చెరువులు, 14 చిన్న చెరువుల కింద దాదాపు 8వేల ఎకరాల ఆయకట్టు ఉన్నది. అయితే వానకాలంలో ఇబ్బంది లేకున్నా యాసంగిలో మాత్రం పూర్తి స్థాయిలో నీరందించలేని దుస్థితి ఉన్నది. ఈ క్రమంలో ఏడాదిన్నర కిందటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి బరాజ్ నుంచి నీటిని తరలించి చెరువులు నింపి పంటలకు పుష్కలంగా నీరందించింది. ఎల్లంపల్లి నుంచి గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించేది. అక్కడి నుంచి ఫాజుల్‌నగర్ చెరువుకు సరఫరా చేసి, లింక్ కెనాల్ ద్వారా చందుర్తి మండలంలోని మల్యాల, బండపల్లి రిజర్వాయర్లను నింపేది. ఈ లింక్ కెనాల్‌కు అనుసంధానంగా ఉన్న చిన్నకాలువల ద్వారా మండలంలోని చెరువులన్నీ నిండేవి. పొలాలకు పుష్కలంగా నీరందేది. అయితే ప్రభుత్వం మారడంతో పట్టింపు కరువైంది. ఎల్లంపల్లి నుంచి ఏదో తూతూమంత్రంగా మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదే క్రమంలో రైతుల విజ్ఞప్తి మేరకు ఇటీవల ఎల్లంపల్లి నుంచి నీటిని వదిలి నమిలిగుండుపల్లిలోని వంకసముద్రం, నూకలమర్రిలోని లింగంచెరువు, ఊరచెరువు, వెంకటాంపల్లిలోని కరీదుకుంటను నింపగానే, కాలువ ఎండిపోయింది. మిగిలిన చెక్కపల్లిలోని కొండ చెరువు, ఎదురుగట్లలోని ఊర చెరువు, లక్ష్మీదేవికుంట, అచ్చనపల్లిలోని కొత్తచెరువు, బాలరాజుపల్లిలోని భవానికుంట, కుమ్మరికుంట, నాగయ్యపల్లిలోని నాగుల కుంట, బడికుంట, ఎర్రకుంట, గుండ్లకుంటతో పాటు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న కోనాయపల్లి, శాత్రాజుపల్లి గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు రాక వెలవెలబోయాయి. చుక్కనీరు లేక అధ్వానంగా కనిపిస్తున్నాయి.

### ఆందోళనలో రైతులు

యాసంగికి ఎల్లంపల్లి నుంచి నీరు వస్తుందని రైతులు నమ్మి పుష్కలంగా వరి సేద్యం చేశారు. కానీ, ప్రభుత్వం కేవలం నాలుగు చెరువులు మాత్రమే నింపడంతో మిగిలిన చెరువుల కింద రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. చెరువుల్లో నీరు లేని కారణంగా భూగర్భజలాలు పడిపోయి బోర్లు, బావులు వట్టిపోయాయి. మరో 20 రోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో పంట ఎండిపోతుండడంతో రైతన్న కన్నీరుమున్నీరవుతున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మండలంలోని దాదాపు అన్ని చెరువులు నింపారని, కానీ, ఇప్పుడు పట్టించుకునేవారే లేరని ఫలితంగా పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

# 18న ఎంబీఏ అడ్మిషన్ కౌన్సెలింగ్

కరీంనగర్ తెలంగాణ చౌక్, మార్చి 16 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ (హెచ్‌హెచ్‌సీఎం) అడ్మిషన్ కౌన్సెలింగ్ ఈ నెల 18, 19వ తేదీల్లో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ అభ్యాసక సహాయ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ వై వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినవారు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐసెట్ -2025లో అర్హత సాధించిన వారు ఈ కౌన్సిలింగ్‌కు హాజరు కావచ్చని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే అడ్మిషన్స్‌కు కౌన్సెలింగ్‌కు వెళ్లాలని, అర్హత పరీక్ష, ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ ఫొటో స్టాట్ కాపీలు, రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.



ఫిబ్రవరి 9: గోదావరిఖనిలో వెలవెలబోతున్న గోదారి

# గోదారి గోస వినిపించేందుకు..

- గోదావరిఖని నుంచి ఎర్రవెల్లి వరకు ఆరు రోజుల పాటు మహాపాదయాత్ర
- నేడు కోరుకంటి ఆధ్వర్యంలో ప్రారంభం
- కాంగ్రెస్ సర్కారు తీరును ఎండగడుతూ సాగనున్న 180 కిలోమీటర్ల యాత్ర

పెద్దపల్లి, మార్చి 16(నమస్తే తెలంగాణ): గోదావరి తల్లి కన్నీటి గోసను వివరిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టత, కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ సోమవారం మహాపాదయాత్ర ప్రారంభం కానున్నది. ఈ నెల 22 వరకు జరిగే ఈ యాత్ర ఉద్యమాల పురిటి గడ్డ గోదావరిఖని నుంచి ఎర్రవెల్లి వరకు 180 కిలోమీటర్ల పాటు కొనసాగనున్నది. ఈ మేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కో ఆర్డినేటర్ బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాగా, పాదయాత్ర సందర్భంగా గోదావరి తీర ప్రజల గోస, అన్నదాతల కష్టాలు, కన్నీళ్లను వివరించుకుంటూ ముందుకు సాగనున్నది.

### యాత్ర సాగేదిలా..

గోదావరిఖని గోదావరి తీరంలో కొలువైన మహాశివుడికి సోమవారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు చేసి, సమీపంలోనే కొలువైన సమ్మక్క-సారలమ్మ గద్దెలకు ప్రత్యేక మొక్కులు చెల్లించుకొని పాదయాత్రను ప్రారంభించనున్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరు కానుండగా, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల మాజీ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, నడిపెల్లి మురళీధర్‌రావు, పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొననున్నారు. మొదట గోదావరిఖనిలోని జీఎం కాలనీ వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహం, ఖని చౌరస్తాలోని అమరవీరుల స్మారక స్తూపం, రాజేశ్ థియేటర్ వద్దగల జ్యోతిరావు పూలే, మున్సిపల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేస్తారు. మధ్యాహ్నం పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లో భోజనం పూర్తి చేసుకొని పెద్దపల్లి శివారులోని బంధంపల్లి స్వరూప గార్డెన్‌కు చేరుకుంటారు. రాత్రి అక్కడ బస చేసి, రెండో రోజైన మంగళవారం ఉదయం 6 గంటలకు మళ్లీ యాత్ర ప్రారంభమై, పెద్దపల్లి మీదుగా సుల్తానాబాద్‌కు బయలు దేరుతారు. అక్కడి నుంచి కరీంనగర్‌కు చేరుకుంటారు. మూడో రోజు బుధవారం ఉదయం 6 గంటలకు బయలుదేరి అల్గునూర్ మీదుగా బెజ్జంకి ఎక్స్‌రోడ్‌కు చేరుకుంటారు. నాలుగో రోజు గురువారం ఉదయం 6 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం వరకు ఇబ్రహీంనగర్‌కు చేరుకుంటారు. సిద్దిపేట రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో రాత్రి బస చేస్తారు. ఐదో రోజు శుక్రవారం ఉదయం 6 గంటలకు మళ్లీ యాత్ర ప్రారంభమై మధ్యాహ్నం కొమురవెల్లి-1 హోటల్‌కు చేరుకుంటారు. రాత్రి వరకు ప్రజ్ఞాపూర్‌కు చేరుకుంటారు. ఆరో రోజు శనివారం ఉదయం 5 గంటలకు ప్రారంభమై మధ్యలో భోజనం చేసి ఎర్రవెల్లి వరకు వెళ్తారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి కాంగ్రెస్ పార్టీ కుట్రలు, కన్నీటి బాధలు, రైతన్నల కన్నీటి గాథలను వివరించనున్నారు.

# రుణమాఫీ చేయండి మహాప్రభో!

- అర్హత పత్రాలు చూపుతూ మొగిలిపేటలో రైతుల నిరసన
- సుమారు 350మందికి మాఫీ కానట్టు ప్రాథమిక అంచనా
- మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- నేడు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడి



మొగిలిపేటలో అర్హత పత్రాలను చూపుతూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మల్లాపూర్, మార్చి 16 : 'మా గ్రామంలోని వందలాది మంది రైతులకు వెంటనే రుణమాఫీ చేయండి మహాప్రభో' అంటూ మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామ రైతులు డిమాండ్ చేశారు. సంబంధిత పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను చూపుతూ ఆదివారం గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. రూ.2లక్షల లోపు రుణం తీసుకొని మాఫీ కాని రైతులు సుమారు 150మంది ఉన్నారని, అలాగే రూ.2లక్షలకు పైబడి రుణం తీసుకున్నవారు 200మందికి పైగా ఉన్నారని ప్రాథమికంగా అంచనా వేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు రుణమాఫీ కానివారి కోసం మొగిలిపేట మాజీ సర్పంచ్ వనతడపుల నాగరాజు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి, రైతుల వద్ద నుంచి సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తులను ఆదివారం తీసుకున్నారు. శిబిరంలో 54మంది రైతులు దరఖాస్తులు అందజేశారు. వీరి సమస్య పరిష్కారం సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మాజీ సర్పంచ్ తెలిపారు.



### రేవంత్‌రెడ్డి సర్కార్ మాఫీ చేయలె

అందరికీ రుణమాఫీ అయితదని ఆశపడ్డం. నా అసోంటి చానామంది రైతులకు మా ఊళ్లె రుణమాఫీ కాలేదు. నాకు గ్రామంలో రెండు ఎకరాల ఎవుసం భూమి ఉన్నది. మక్క, పొలం వేసిన. మా గ్రామంలోని కెనరా బ్యాంక్‌లో రూ.70వేలు తీసుకుని వడ్డీ, అసలు కలిపి రెన్యువల్ చేసుకుంటు వస్తున్న. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు రూ.70వేలు మాఫీ అయినయి. ఎన్నికల ముందే మళ్లీ రూ.70వేలు తీసుకున్న. ఇప్పటికీ రేవంత్‌రెడ్డి సర్కారు రుణమాఫీ చేయలేదు.

- అప్పని చిన్నరాజన్న (మొగిలిపేట)



### సమస్యల పరిష్కారానికే

అసెంబ్లీ సాక్షిగా సీఎం, ఇతర మంత్రులు రుణమాఫీ విషయంలో అబద్ధాలు చెబుతున్నరు. కేవలం మా ఒక్క గ్రామంలోనే చానామంది రైతులకు ఒక్క పైసా సైతం రుణ మాఫీ అందలేదు. రైతుల సమస్యల పరిష్కారం కోసం గ్రామంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినం. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత రైతులతో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో కలెక్టర్‌ను కలుస్తాం. ఎందుకు రుణమాఫీ కాలేదు.. ఎక్కడ జాప్యం జరిగిందో తెలుసుకొని రుణమాఫీ అయ్యేంత వరకు పోరాటం చేస్తాం.

- వనతడపుల నాగరాజు, మాజీ సర్పంచ్ (మొగిలిపేట)



### రూ.50వేల కోసం.. యాభైసార్లు తిరిగిన

నాకు గ్రామ శివారులో ఎకరం ఎవుసం భూమి ఉన్నది. మా గ్రామంలోని కెనరా బ్యాంక్‌లో కొన్నేండ్ల క్రితం రూ.50 వేల బాకీ తీసుకున్న. అయితే నాకు రుణమాఫీ కాలేదు. అధికారులు, బ్యాంక్ అధికారుల దగ్గరకు ఎన్నిసార్లు పోయినా.. ఎలాంటి ఫలితం లేదు. దేవుడి దయ ఉంటే నాకు మాఫీ వస్తది లేకుంటే లేదని నిర్ణయించుకున్న.

- ఎనగందుల లింగన్న (మొగిలిపేట)



పెద్దాపూర్ గ్రామంలోని మల్లన్న స్వామి ఆలయం వద్ద బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న వేలాది మంది భక్తులు

# బోనమో.. మల్లన్నా

- కనుల పండువగా జాతర

మెట్‌పల్లి రూరల్, మార్చి 16: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని మల్లన్నస్వామి దేవాలయంలో ఆదివారం బోనాల జాతర కనుల పండువను తలపించింది. వేలాది మందితో కిక్కిరిసి పోయింది. యాదవుల ఆర్యాధ్యదైవమైన మల్లన్న స్వామికి ఉదయం నుంచే మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల మధ్యన ఆలయానికి చేరుకొని, 'సల్లంగా చూడూ మల్లన్న' అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.